# జాతకకథ



పాలకూర సీతాలత

**సంజీవరావు** ఆఫీసులో జాయినింగ్ రిపోర్టు ఇచ్చాక లంచ్‌బ్రేక్‌లో కొలీగ్‌ని- 'మంచి ఇల్లు దొరుకుతుందా?' అని అడగలేదు. -"కానీ 'ఈ ఊళ్ళో మంచి జ్యోతిష్కుడు ఎవరైనా ఉన్నారా?" అని అడిగాడు. అతనికి ఉన్న జ్యోతిష పిచ్చి అతనిచేత అలా అడిగించింది. అతనికి ఉంటున్న ఊర్నించి బదిలీ అయినందుకు ఏ రకంగానూ విచారించలేదుగానీ, ఆ ఊర్లో ఉన్న మంచి జ్యోతిష్కుడికి దూరం అయిపోతున్నామే అని విచారించేడు. ఈ కొత్త ఊళ్ళో అవధాని అనే జ్యోతిష శాస్త్ర పారంగతుడు ఉన్నాడని విని సంతోషించేడు.

మరొక పదిహేను రోజుల్లో మంచి ఇల్లు చూసుకుని కుటుంబంతో సహా స్థిరపడ్డాడు సంజీవరావు. ఆయన కొడుకు- ఇరవై ఏళ్ళ కాలేజీ విద్యార్థి- ఆ ఊళ్ళో ఎన్ని సినిమా హాల్సు ఉన్నాయో, రిలీజ్ పిక్చర్స్ వస్తాయో, రావో తెలుసుకునేందుకు ఊరిమీద పడ్డాడు. ఆయన కూతురు అరవింద ఊళ్ళో మంచి మంచి బట్టల దుకాణాలు ఉన్నాయా లేదా, తను కాలేజీకి వేసుకు వెళ్ళేందుకు లేటెస్ట్ డిజైను బట్టలు దొరుకుతాయా- లేదా అన్న విషయం ఎంక్వయిరీ చేస్తోంది.

ఆరోజు సాయంత్రం సంజీవరావు తనతో పాటు అవధానిగారిని తీసుకువచ్చేడు ఇంటికి. అతిథి మర్యాదలు చేశాడు. ఇంట్లో అందర్నీ పిలిచి పరిచయం చేసి, పిల్లలచేత నమస్కారం పెట్టించాడు. ఆ తర్వాత ఇంట్లో అందరి చేతులూ ఆయనకు చూపించేడు. ముక్కుపొడుం దట్టించి ఆయన ఒక్కొక్కరి గురించీ చెప్తుంటే, ఉన్నది ఉన్నట్లుగా చెప్పగలుగుతున్న ఆయన పాండిత్యానికి రవ్వంత అబ్బురపడ్డాడు.

సాధారణంగా జోస్యం చెప్పేవాళ్ళకు ఆ విద్యలో పాండిత్యం కన్నా కొంచెం కామన్ సెన్సూ, మాటల చతురతా ఉండాలి. అలా అయితేనే నెగ్గుకు రావచ్చు. చాలా గొప్పవాడన్న పేరు సంపాదించవచ్చు. అవతలివా

ళ్ళకు ప్రీతి కలిగించేలా మాట్లాడాలి. ఉదాహరణకు అవతలి వ్యక్తితో ఒక జ్యోతిష్కుడు —

"మీరు మీ గురించేకాక ఇతరుల బాగోగుల గురించి ఆలోచిస్తారు. పరాయివాళ్ళకు ఎంతగానో సాయం చేస్తారు. కానీ, వాళ్ళు దాన్ని గుర్తించరు" అంటే ఆ వ్యక్తి ఎంతగానో సంబరపడిపోతాడు.

"కడుపు కట్టుకుని దాచుకునే లోభిత్వం మీకు లేదు. సుఖజీవనం కోసం డబ్బు ఖర్చు చేస్తారు. అందుకే మీరు ఎక్కువ సొమ్ము దాచుకోలేకపోతున్నారు" అని ఒక పిసినారితో అంటే అతడు- "నిజం చెప్పారు" అంటూ మెచ్చుకుంటాడు.

కాస్త వయసు ముదిరిన వ్యక్తి చెయ్యి చూస్తుంటే-"మీ ఆరోగ్యంలో కొద్దిపాటి అవకతవకలు ఉన్నాయి. అయినా, ఏం ఫరవాలేదు. మీరు నెగ్గుకు వస్తారు" అని చెప్పాలి.

ఎందుకంటే ఆ వయసులో ఏదో ఒక లోపం ఉండకపోదు. ఆ మాట నిజమే అని ఆ వ్యక్తి ఒప్పుకోక తప్పదు.

ఇలాగే మరికొన్ని!

పెళ్ళికాని యువతి చెయ్యి చూస్తూ- "అహా! బంగారంలాంటి చెయ్యి, తల్లీ! నిన్ను వరించేవాడు చాలా అదృష్టవంతుడు. నీ వివాహ జీవితంలో అన్నీ సుఖాలే! పెద్ద ఆఫీసరుకు భార్యవు అవుతావు" అని చెప్పాలి. అప్పుడు ఆ అమ్మాయేకాక, ఆమె తల్లితండ్రులుకూడా మురిసిపోయి ఇవ్వవల్సిన దానికంటె ఎక్కువ సొమ్ము ముట్టచెప్తారు.

అలాగే ఒక ఉద్యోగస్థుడి చెయ్యి చూసి—"లైఫ్‌లో గొప్ప జంపు ఉంది. మీరు గొప్ప అదృష్టజాతకులు. త్వరలోనే ప్రమోషన్ వస్తుంది" అనాలి.

ఇవన్నీ జ్యోతిష్కుడిగా నిలబడా లనుకుంటె పాటించాల్సిన చిట్కాలు.

జోస్యం నేర్చుకుంటున్న ఒకడు మహారాజు చెయ్యిచూసి—"నీ బంధువు లందరూ నీ కళ్ళముందే చస్తారు" అన్నాట్ట. కోపం వచ్చి వాడిని జైల్లో ఉంచాడు రాజు. ఆ తర్వాత జ్యోతిషంలో ఆరితేరిన మరొక ఉద్దండుడు రాజుగారి చెయ్యిచూసి- "మీ బంధువు లందరికంటె కూడా మీ ఆయుర్దాయం ఎక్కువ, ప్రభూ!" అన్నాట్ట. దాంతో సంతోషించిన రాజుగారు అతన్ని ఏం కావాలో కోరుకోమంటే "జైల్లో ఉన్న జోస్యం నేర్చుకుంటున్న వాడిని విడిపించ"మని కోరి వాడిని విడిపించేడుట. ఆ తర్వాత వాడితో—"చెడ్డమాటే అయినా, ఇష్టం కలిగించే మాటల్లో చెప్పాలి" అని బోధించేడుట.

ఈ మెలకువలన్నీ బాగా తెల్సినవాడు కావడంతో అవధాని గారు ఉద్ధండ పండితులైపోయేరు. చివరగా ఆయన సంజీవరావు చెయ్యిచూసి పైన చెప్పినలాంటి విషయాలు చాలావరకూ చెప్పి ఆయన్ని సంతోషపెట్టింతర్వాత మరో రెండు విషయాలు చెప్పారు.

"మీ అమ్మాయి అరవింద పెళ్ళి మీ చేతులమీదుగా కాదు. మీరు ఎనభై ఏళ్ళదాకా బ్రతుకుతారు-అదికూడా మంచంమీద పడి కాదు."

ఈ రెండు విషయాలూ సంజీవరావును బాగా ఆకర్షించాయి.

ఆ తర్వాత అవధానిగారికి దండిగా డబ్బులు తాంబూలంలో పెట్టి కూతురిచేత ఇప్పించేడు. ఆయన గట్టిగా- "శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు" అని దీవించేరు.

రెండురోజులు గడిచిపోయేయి. ఆరోజు అవధానిగారు చెప్పిన రెండు విషయాల్లో మొదటిది గుర్తుకురాగా మరొక రకమైన అర్థం స్ఫురించి గాభరా పడిపోయేడు. కూతురు పెళ్ళి తన చేతుల మీదుగా జరగదు అంటే తను చచ్చిపోయేక కూతురి పెళ్ళి అవుతుందని అర్థం కాదు. ఎందుకంటే తన ఆయువు ఎక్కువే గనుక. అంటే ఏమిటి? తను ఉండగాకూడా కూతురి పెళ్ళి తన చేతుల్తో జరగదు అని. కానీ, అలా ఎందుకు అవుతుంది? ఆ( ! ! ! కరెక్టు...అంటే కూతురు తనకు ఇష్టంలేని ఎవరినో ప్రేమించి పెళ్ళికి సిద్ధం అవుతుందన్న మాట. తనకు తెలియకుండానే పెళ్ళి చేసుకుంటుందన్న మాట. ఎంత ఘోరం? అలా జరిగితే తను ఆ అవమానం తట్టుకోగలడా? ఆ తర్వాత తల ఎత్తుకుని తిరగగలడా?

పోనీ, అవధానిగారి మాటలు తప్పు అని అనుకుందామా అంటే అందుకు మనసు ఒప్పుకోవటం లేదు. అందుకు కారణం ఆయనకు ఉన్న గొప్పపేరు. అంత ఎందుకు? ఆయన తన కుటుంబ సభ్యులగురించి చెప్పినది పూర్తిగా నిజం అని రుజువు అవుతోంది. కనుక అరవింద విషయంలోకూడా ఆయన చెప్పేది. నిజం అవుతుంది. ఈ భయంకర ఘోర అవమానకరమైన పరిస్థితినుంచి తను బైట పడగలడా! అలా కాకుండా తను తగిన జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందేమో! అవును, ఆలోచించాలి.

అవే ఆలోచనలు ఆయన్ని పీడించసాగేయి. అరవిందను చూసినప్పుడల్లా ఆ చేదు విషయం గుర్తొచ్చి మరింత బాధ కల్గుతోంది. అరవింద ప్రవర్తనను చాలా తీవ్రంగా గమనించసాగేడు.

ఒకరోజు అరవింద కాలేజీ నుంచి వచ్చి పుస్తకాలు ఇంట్లో పడేసి ఎవరో ఫ్రెండు దగ్గరకు వెళ్ళాలని వెళ్ళిపోయింది. సంజీవరావు ఆమె పుస్తకాలు అన్నీ తీసి ఒక్కొక్కటే చూడసాగాడు. ఎందులోనైనా ప్రేమలేఖ ఏమైనా ఉందేమో అని వెతకడం అది. ఆ తరవాత ఆమె పెట్టెకూడా తీసి వెతికాడు. అలాంటిది ఏమీ కనిపించలేదు. 'చాలా తెలివితో ఇంకా వేరే ఎక్కడైనా దాచింది కాబోలు' అని అనుమానించాడు.

భార్య అడిగింది- "ఎందుకవన్నీ వెతుకుతున్నారు?"


విషయం చెప్పాడు. "దాన్ని చాలా జాగ్రత్తగా గమనించాలి. ఏదైనా కానివని చేస్తే కష్టం" అన్నాడు.

అతని చాదస్తానికి నవ్వింది. "ఏవో వంద చెబుతారు జ్యోతిష్కులు. అన్నీ నిజం అవుతాయా ? నా కూతురు నిప్పు. దాన్ని అలా అనుమానించడం నాకే అవమానం" అంది.

రాజీ పడలేదు సంజీవరావు.

"ఏదో సరదా కోసం చెయ్యి చూపించుకోవచ్చు. అంతేకానీ దానినే నమ్మి మానసికంగా వేదన అనుభవించడం అంత తెలివైన పనికాదు. కాబట్టి. . ."

ఆమె మాటలు పూర్తిగా వినకుండానే తల



అడ్డంగా ఊపాడు. అతన్ని ఒప్పించలేక తనే నోర్మూసుకుంది, పాపం, ఆ మర్నాడు అరవింద కాలేజీ నుంచి ఆలస్యంగా వచ్చింది. ఎందుకని అడిగితే ప్రైవేటు క్లాసు ఉందని అంది. ఆ తరవాత కూడా వరుసగా రెండురోజులు ఆలస్యంగా వచ్చి అదే కారణం చెప్పింది. కానీ సంజీవరావుకి నమ్మకం కలగలేదు. 'ఖచ్చితంగా ఇది ఎవడితోనో ప్రేమలో పడి షికార్లు చేస్తూంది. ఆ విషయం దాచి పెట్టడానికి ఇలా అబద్ధం ఆడుతూంది. తను తెలుసుకోలేడని నమ్మింది. కానీ తను గుండెలు తీసిన మొనగాడు, మోసగాళ్ళకు మోసగాడు. ఆ విషయం తేల్చేస్తాడు."

ఆ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న అరుణాచలంతో ఉన్న పరిచయం కొద్దీ అడిగాడు.

"అవును. ఆమెకు ప్రైవేటు క్లాసులు నడుస్తున్నాయి. నేనే పెట్టాను. ఆ సబ్జక్టు నేనే చెబుతున్నానులే. ఏమిటి సంగతి ?" అన్నాడు అరుణాచలం.

తన కూతురు తనతో అబద్ధం చెప్పలేదన్న సంతోషం కంటె, తన అనుమానం నిజం కాలేదన్న బాధే ఎక్కువ కలిగింది సంజీవరావుకి. ఒకరోజు సాయంత్రం ఆఫీసునుంచి వస్తుండగా జంక్షన్ దగ్గర ఎవరితోనో స్కూటర్ మీద వెళుతూ అరవింద కనిపించింది. అది చూస్తూనే సంజీవరావు కళ్ళలో నిప్పులు కురిశాయి.'ఈరోజు ప్రత్యక్షంగా దొరికిపోయింది. ఇంటికి రానీ, చెబుతాను. ఊరుకుంటే లాభంలేదు.' అనుకుని ఆవేశంగా ఇల్లు చేరాడు. ఇంటి ముందు స్కూటర్ ఆగి ఉంది. 'ఓహో, వాడిని ఇంటిక్కూడా తీసుకు వచ్చిందన్నమాట. ఎంతకు బరి తెగించింది?


అని ఆశ్చర్యపోతూ లోపలకు వెళ్ళాడు. లోపల కుర్చీలో అతని అన్న కొడుకు కుమారస్వామి కూర్చుని ఉన్నాడు. చేతిలో 'కీ' చెయిన్ తిప్పుతున్నాడు. అవి స్కూటర్ తాళాల లాగే ఉన్నాయి. వాడు ఇక్కడికి వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న ఒక గ్రామంలో బ్యాంకులో పని చేస్తున్నాడు. వీడు ఇప్పుడు ఎందుకు వచ్చాడు ?

"నమస్తే, బాబాయ్!ఈ ఊళ్ళో కొంచెం పని ఉండి వచ్చాను. కొత్తగా స్కూటర్ తీసుకున్నానులే. అందుకే అది వేసుకుని వచ్చాను, సరదాగా" అన్నాడు.అరవింద కాఫీ తెచ్చి అన్నగారికి ఇచ్చింది."నీక్కూడా తెస్తానుండు, నాన్నా!" అంటూ లోపలకు వెళ్ళింది.అయితే అది ఇందాకా వీడి స్కూటర్ మీద ఎక్కిందా! తను అపార్థం చేసుకున్నాడన్నమాట.కాఫీ తెచ్చిన అరవిందతో అన్నాడు కుమారస్వామి.

"ఏమే!ఎప్పుడూ స్కూటర్ ఎక్కలేదా? నా స్కూటర్ మీద కూర్చున్నప్పుడు చాలా కష్టపడ్డావ్, కూర్చుందుకు ?"

ఆ తరవాత సంజీవరావుతో అన్నాడు-

"నేను వస్తుంటే బస్ స్టాండ్ దగ్గర




కనిపించిందిలే. దాన్ని ఎక్కించుకుని వచ్చాను."

కూతుర్ని అనుమానించినందుకు సిగ్గుపడిపోయాడు.ఆ తరవాత ఒకటే నిర్ణయించుకున్నాడు. అనుక్షణం ఈ అనుమానపు సంద్రంలో మునిగి పోవడంకంటే వెంటనే కూతురుకి పెళ్ళి చేసెయ్యడం ఉత్తమం. తన చేతుల మీదుగా ఆ పెళ్ళి జరిగిపోతే తప్ప తనకు శాంతి ఉండదు. త్వరలో ఆ శుభ ఘడియ వచ్చేస్తే తన చేతులతో, ఆ వివాహం జరిగే అవకాశాలు హెచ్చుఅవుతాయి.

వెంటనే సంబంధాలు చూడ్డం మొదలుపెట్టాడు. రెండు నెలలు తిరక్కుండానే ఒక సంబంధం కుదిరింది. కుర్రవాడు ఇంజినీరు. మరొక నెల రోజుల్లో అమెరికా వెళ్ళిపోతున్నాడు. అంతకుముందే పెళ్ళి జరగాలని కోరారువారు. ఒకసారి దేశం విడిచి పెట్టేస్తే మళ్ళీ సంవత్సరందాకా అతడు రాడట. వాళ్ళకూ తొందరగానేఉంది. తనకూ తొందరగానే ఉంది. మరింకేం ? వెంటనే ముహూర్తం పెట్టించాడు. పెళ్ళికి సన్నాహాలు చేస్తున్నాడు. పెళ్ళి అయిపోయాకా నాలుగైదు నెలలకు అరవిందకు ఫైనల్ పరీక్షలు అయిపోతాయి. ఆ తరవాత ఆమెనుకూడా ఆ దేశం పిలుచుకుపోతాడట. 'అన్నివిధాలా చక్కని సంబంధం. ఇంత యోగ్యమైన కుర్రవాడు దొరకడం అదృష్టం' అని సంజీవరావు అనుకున్నాడు. ఆ పెళ్ళి తన చేతుల మీదుగానే జరిగిపోతుందని సంతోషించాడు. 17 వ తేదీన వివాహం , 22 వ తేదీన కుర్రవాడి అమెరికా ప్రయాణం.


ముహూర్తంరేపు అనగా పెళ్ళి సామాన్లు రిక్షాలో వేసుకుని వస్తున్న సంజీవరావుని ఎదురుగా వస్తున్న లారీ గుద్దేసింది. అంత దూరం విసిరివేయబడ్డాడు. తలకీ,కాళ్ళకీ బలమైన గాయాలు తగిలాయి. వెంటనే హాస్పటల్లో చేర్చారు. విషయం తెలిసి అందరూ వచ్చారు. ఒంటినిండా కట్లతో, కదలలేని స్థితిలో ఉన్న సంజీవరావు దగ్గరకు డాక్టర్ వచ్చి "మరో పది రోజుల దాకా మంచం మీదే ఉండా" లని చెప్పాడు. అతను కంగారు పడిపోయాడు. తెల్లవారితే కూతురి పెళ్ళి. ఎలా జరపాలి?పోనీ మరొక ముహూర్తానికి చేద్దామా అంటే సమయంలేదు. కుర్రవాడు వెంటనే అమెరికా వెళ్ళిపోవాలి. అన్నీ తయారయి పోయాకా అతను వెళ్ళడం తప్పదు అదే రోజు. పోనీ తరవాత చూద్దామంటే మరొక సంవత్సరందాకా కుర్రవాడు రాడు. పెళ్ళికోసం విడిదిలో ఉన్న మగ పెళ్ళివారు కూడా వచ్చారు అతన్ని చూడటానికి.

"ఇప్పుడు ఎలాగ, బావగారూ! ఇంత అర్భాటంగా ప్రయత్నాలు చేసి ఉన్నాం. తీరా ..."అంటూ బాధ పడ్డాడు కుర్రవాడి తండ్రి.

అప్పటికే బాగా నిర్ణయం చేసుకున్న సంజీవరావు దీర్ఘంగా తల పంకించాడు.

"మీ రేం ఆందోళన చెందకండి, బావగారూ! ఈ పెళ్ళి జరుగుతుంది.అనుకున్న ముహూర్తానికే జరిగి తీరుతుంది. నా బదులు మా అన్నయ్య పీటలమీద కూర్చుంటాడు. వాడు కన్యాదానం చేస్తాడు. వేరే పరిస్థితుల్లో అయితే ముహూర్తం మార్చేవాళ్ళం కానీ ఇప్పుడు కుర్రవాడి ప్రయాణం దృష్ట్యా అది సాధ్యంకాదు. మళ్ళీ సంవత్సరం దాకా ఆగడం నాకూ ఇష్టం లేదు, మీకూ ఇష్టం ఉండదు" అన్నాడు సంజీవరావు.

దానికి మగపెళ్ళివారు ముందు కొంచెం అభ్యంతరం చెప్పినా, అంతకంటె మార్గం లేక సరే నన్నారు. బాధపడుతున్న భార్యను ఓదారుస్తూ సంజీవరావు "ఎందుకే, పిచ్చిదానా! మనం అనుకున్నవన్నీ జరగవు. మన ఇష్టప్రకారం అమ్మాయి పెళ్ళి మనకు నచ్చిన కుర్రవాడితో జరుగుతూంది. అదే పది వేలు. మన చేతులమీదుగా కన్యధార పొయ్యలేకపోతున్నా. అంతేకదా! ఇప్పుడిప్పుడే అర్థం అవు




తూంది. దాని పెళ్ళి నా చేతులమీదుగా జరగదని అవధానిగారు అన్న విషయం ఈ రకంగా నిజం అవుతూందన్నమాట. ఆ విషయం అబద్ధం చెయ్యాలని పాటుపడ్డాను. కానీ మరో రకంగానే అయినా నిజం అవుతూంది. మనం బాధపడి ప్రయోజనం లేదు. జోస్యంమీద ఉన్న నా నమ్మకం మరింత బలపడుతూంది" అన్నాడు.

అనుకున్న ముహూర్తానికే అరవింద పెళ్ళి జరిగిపోయింది, ఆమె పెదనాన్నగారి చేతుల మీదుగా.

ఆ తరవాత పూర్తిగా కోలుకోవడానికి నెలరోజులు పట్టింది సంజీవరావుకి. ఆ తరవాత మరొక రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. అరవిందకూడా అమెరికా వెళ్ళిపోయింది.

వయసు మీదపడుతున్నకొద్దీ రోగాల ప్రభావం సంజీవరావుమీద పడింది. బి. పి, మగరు వచ్చాయి. డాక్టరు చక్కెర తినవద్దన్నాడు. కానీ పంచదార లేకుండా గడపలేకపోతున్నాడు సంజీవరావు.

"డాక్టర్లు వాళ్ళ పథ్యాల గురించి బెంగపడకూడదు. నాకు ఎనభై సంవత్సరాల ఆయుష్షు ఉందని అవధానిగారు చెప్పారు. ఈలోగా నేను ఎంత కేర్‌లె °సగా ఉన్నా నాకు ఏమీ ఆదు. అవధానిగారు నా పాలిట దేవుడు. ఆయన చెప్పిన విషయం అక్షరాలా జరిగింది. కనుక నా ఆయువు విషయంలో కూడా అంతే. మరికొంచెం పంచదార వెయ్యి ఈ కాఫీలో" అనేవాడు భార్యతో,ఆమె మగర్ వాడకూడదని చెప్పినప్పుడు.

"అద కాదండీ! ఆరోగ్యం కాపాడుకుందుకు పథ్యం చే °స తీరాలి. మీరు కాదని మొండికే స్తే అది వేరే ఇతరమైన వ్యాధులకి కారణం కావచ్చు. తరవాత ఎక్కడలేని శ్రమా!" అనేది భార్య.

ఆ మటలు పూర్తిగా వినకుండానే—

"చూడు! నా గురించి అనవసరంగా కంగారుపడకు. ఎనభై ఏళ్ళ వయసు వచ్చేదాకా నేను మార్కండేయుడినే. యముడే దిగి వచ్చి నా తోక ముడిచి పారిపోతాడు. నాకు కాన్సర్ వచ్చిందనుకో. డాక్టర్లు ఆరు నెలలకన్నా బతకనని అన్నారనుకో. అయినానరే,నేను నమ్మను. ఆ వచ్చింది కాన్సర్‌అని డాక్టర్లు పొరపడి ఉండాలి. లేదా అంత భయంకరమైన కాన్సరూకూడా నా లోనే అణిగి మణిగి ఉంటుంది. నా ముందు ఓడిపోతుంది. కారణం-నేను ఎనభై సంవత్సరాల వరకూ దుక్కుముక్కలా ఉంటాను "అన్నాడు. అతనికి అవధానిగారి మీద ఉన్న నమ్మకం అది. ముందునుంచీ జోస్యం అంటే పిచ్చి. పైగా అరవింద విషయంలో నిజం కావడంతో మరింత బలపడిం ఆ నమ్మకం. మరికొన్ని రోజులు గడిచిపోయాయి.

అతనికి ఈమధ్య సాయంత్రంపూట జ్వరం రావడం మొదలుపెట్టింది. ఫరవాలేదు అనుకుని ఒక 'క్రో °సన్' మాత్ర మింగేవాడు. ఆ తరవాత జ్వరం తగ్గిపోయేది. ఇలా రోజూ వస్తూ ఉంటే భయపడింది భార్య.

"ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళితే మంచిదేమో!" అంది.

"ఎందుకు? ఏదో లేని రోగం పేరు చెప్పి నాలుగు మందులు రాస్తాడు. అనవసరంగా డబ్బు ఖర్చు తప్ప వేరే ఉపయోగం లేదు. డాక్టర్లందరూ అంతే. 'నీకు ఏ రోగమూ లేదు, నాయనా' అని ఎవడైనా డాక్టరు అనడం ఎప్పుడైనా విన్నావా? అనడు. ఎందుకంటే అది వాడి బ్రతుకు తెరువు కనక " అంటూ ఆమె మటలు కొట్టి పడేశాడు.

మరొక నెల రోజులు గడిచిపోయాయి. సంజీవరావు విపరీతంగా చిక్కిపోవడం మొదలుపెట్టాడు. దగ్గు వస్తూంది. అప్పుడు భార్య మళ్ళీ పోరింది.

"నాకు ఏమీ కాదు. నా ఆయువు ఎనభై సంవత్సరాలు" అంటూ పాత పాటే పాడాడు.ఇక నోర్మూసుకుని ఉండలేకపోయింది. బలవంతంగా తీసుకు వెళ్ళింది. అన్ని పరీక్షలూ చే °స రెండు రోజులతరవాత—

"మీకు టి.బి. ఉంది. అనవసరంగా ఆలస్యం చేశారు" అన్నాడు డాక్టరు. ట్రీట్‌మెంట్ మొదలుపెట్టాడు. " °సగరెట్లు తాగవద్దు" అన్నాడు డాక్టర్... ఒకరోజు మసేశాడు. ఉండలేక మరునాడు °సగరెట్ వెలిగించాడు. భార్య వద్దని బ్రతిమాలింది.

"చూడు. నీతో కంటె ఈ °సగరెట్‌తో నా అనుబంధం ఎక్కువ. నేను ఇరవైనాలుగో ఏట నిన్ను చేసుకున్నాను. కానీ °సగరెట్ మాత్రం ఇరవయ్యో ఏటనుంచీ అలవాటు అయింది. అంటే నేను చెప్పబోయేది నీకు అర్థం అయింది కదా ?" ఆమె ముఖం చిన్నబోయింది.

"అంటే నన్ను వదులుకోగలరు కానీ, ఈ °సగరెట్‌ని కాదు. అంతేగా! "అంది బాధగా. ఆ బాధ గమనించనట్లుగా °సగరెట్ పొగ పీల్చడంలో లీనం అయ్యాడు. మరికొన్ని రోజులు గడిచాయి.

అతని కాళ్ళు నీరుపట్టి బాగా ఉబ్బిపోయాయి.

"లంగ్స్ ముడుచుకుపోయాయి. అందువల్ల హార్ట్ ఎటాక్ వస్తుంది" అన్నాడు డాక్టర్.

"ఎవరు ఎటాక్ చే °సనా నాకు ఏం కాదు. ఎందుకంటే నా వయసు. . . "అంటూ పాత పాట పాడాడు.

అతని గురించి అందరూ భయపడసాగారు కానీ అతను భయపడలేదు. అతని గురించి అందరూ బెంగపడిపోయారు కానీ అతను బెంగపడలేదు. అతని భార్య సరిపెట్టుకు పోసాగింది. అంతకంటె ఏం చెయ్యగలదు, పాపం!

'అవధాని గారి జోస్యం నిజం కావాలి. . . 'ఆమె ఇదే కోరుకుంది.

కానీ... కానీ...

ఆ రాత్రి ఆయనకు విపరీతంగా గుండెలో నొప్పి వచ్చింది.అదే ఆయనకు ఆఖరి రాత్రి అయింది.గుండెపోటుతో సంజీవరావు మరణించాడు తన అరవయ్యవ ఏట.

అంటే, జోస్యం ప్రకారం ఇరవై సంవత్సరాల ముందు. ఏడుపులూ, మొత్తుకోవడాలూ మమూ లే. అతని భార్యకు గొప్ప అనుమానం ముందు నిలిచింది. కూతురు పెళ్ళి విషయంలో అంత ఖచ్చితంగా చెప్పగలిగిన అవధానిగారు భర్త ఆయువు గురించి నిజం ఎందుకు చెప్పలేకపోయారు ?

అది ఆ జ్యోతిషశాస్త్ర లోపమా? శాస్త్రంలో లోపం లేకపోయినా తెలియక అవధానిగారు నోటికి వచ్చినట్లు చెప్పారు కనుక అవధానిగారి లోపమా?

దాన్ని గుడ్డిగా నమ్మి స్వహస్తాలతో గోతులు తీసుకున్న భర్త లోపమా ?

నజల నయనాలతో ఆమె ఆలోచిస్తూంది.